నమస్తే తెలంగాణ
నల్లగొండ
I | నల్లగొండ, బుధవారం 16 ఏప్రిల్ 2025 | NALGONDA

ఎస్సీ హాస్టల్‌లో అవకతవకలపై ఏసీబీ తనిఖీలు


తుంగతుర్తి ఎస్సీ బాలికల హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

తుంగతుర్తి, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్‌లో మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చరణ్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. తుంగతుర్తి ఎస్సీ బాలికల హాస్టల్‌లో మొత్తం 50 మంది విద్యార్థినులకు గానూ నిత్యం 25 మంది మాత్రమే హాజరవుతున్నట్లు గుర్తించామన్నారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, హాజరు పట్టికను వార్డెన్ మారతమ్మ మెయింటెన్ చేయడం లేదని పేర్కొన్నారు. హాస్టల్ దగ్గర్లో శ్మశానవాటిక ఉండడంతో విద్యార్థినులు రాత్రి పూట భయపడుతున్నారని, సరిగ్గా నిద్ర పోలేకపోతున్నారని, అన్నం తిన్న తర్వాత ఎవరింటికి వారు వెళ్లిపోతున్నారని తెలిపారు. పూర్తి విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులు సమర్పించనున్నట్లు చెప్పారు. వారి వెంట ఫుడ్ ఇన్స్పెక్టర్, ఆడిటర్, శానిటరీ ఇన్స్పెక్టర్, లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ఉన్నారు.

జనం గుండెల్లో కేసీఆర్

ఉద్యమ నాయకుడిగా, సీఎంగా ఎన్నో చేశారని తలుచుకుంటున్న జనం

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధం

- పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు మేలు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- తిరుమలగిరిలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం..
- చరిత్రలో నిలిచేలా సభను సక్సెస్ చేద్దాం : మాజీ ఎమ్మెల్యే కిశోర్, మాజీ ఎంపీ బడుగుల


తిరుమలగిరిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, సూర్యాపేట జడ్పీ, మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, బీఆర్ఎస్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు

తిరుమలగిరి, ఏప్రిల్ 15 : ప్రజల గుండెల్లో కేసీఆర్ గూడు కట్టుకున్నారని, ప్రతి రైతు మనస్సులో ఆయన ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఉద్యమ నాయకుడిగా, ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రజలకు ఎన్నో చేశారని, నేడు ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆయనను తలచుకుంటున్నారని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని, కేసీఆర్‌తోనే తమ బతుకులు బాగుపడుతాయని జనం నమ్ముతున్నారని చెప్పారు. ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి మంగళవారం తిరుమలగిరి మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు నిరంతరం నాణ్యమైన కరెంట్ ఇచ్చామని, కానీ ఇప్పుడు ఎందుకు ఇవ్వలేక పోతున్నారని అన్నారు. కరెంట్ కొంటే పైసలు అవుతాయని, కమీషన్ రాదని, అందుకే సక్రమంగా ఇవ్వడం లేదని విమర్శించారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను ఇప్పుడు ఎందుకు కొనసాగించడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ ఎంతో కష్టపడి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, దాని ద్వారా రెండు పంటలకు సాగునీరు ఇచ్చి తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో బీడు భూములను సస్యశ్యామలం చేశారని తెలిపారు. కానీ ఇప్పుడు కాళేశ్వరం నీళ్లు రాక పంటలు ఎండబెట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వ దవాఖానల పరిస్థితి దారుణంగా ఉందని, సరైన మందులు లేవని, వైద్య పరీక్షలు నిర్వహించడం లేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో గురుకులాలను కార్పొరేటుకు దీటుగా తీర్చిదిద్దితే నేడు అధ్వానంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైతే పోలీస్, మిలటరీ ఎవ్వరూ ఆపలేరని హెచ్చరించారు. పదేండ్ల పాలనలో అందిన ఫలాలనే ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, ఈ సారి వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా రావాలనే ఆలోచనతో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో సూర్యాపేట జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య, రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నరసింహారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సభలో కేసీఆర్ దిశా నిర్దేశం

కాంగ్రెస్ పాలనలో కొత్త పథకాలు అమలు కావడం లేదు. గతంలో చేపట్టిన పనులకే మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు, పట్టణాలు ఎంతో ప్రగతి సాధించాయి. ప్రజలు సంతోషంగా జీవనం సాగించారు. కాంగ్రెస్‌తో మళ్లీ అధోగతి పాలైంది. రజతోత్సవ సభకు జనం పెద్ద ఎత్తున తరలిరావాలి. ప్రజా సామ్యాన్ని పక్కదోవ పట్టిస్తున్న కాంగ్రెస్‌కు కేసీఆర్ వరంగల్ సభ ద్వారా దిశానిర్దేశం చేయనున్నారు.

- బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

బీఆర్ఎస్ హయాంలో సిరుల పంటలు

వెనుకబాటుకు గురైన తుంగతుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌దే. కాళేశ్వరం నీటితో బీడు భూముల్లో సైతం సిరుల పంటలు పండాయి. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు సమస్యలు వచ్చాయి. ధాన్యానికి మద్దతు ధర రాక రైతులు నష్టపోతున్నారు. సన్న వడ్లకు బోనస్ కూడా లేదు. బీఆర్ఎస్ హయాంలో వేసవిలో కూడా చెరువులు, కుంటలు నింపాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లు ఇవ్వక పంటలు ఎండిబెట్టింది. ఏడాది కాలంలోనే ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు. అసత్య హామీలతో ప్రజా సంక్షేమాన్ని విస్మరించారు. రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుంచి అభిమానులు, ప్రజలు తరలిరావాలి. సభ సక్సెస్ కోసం బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలి.

-గాదరి కిశోర్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే

బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నేతలు గొంగిడి, క్యామ, చింతల తదితరులు

మత్స్యగిరి నుంచి యాదగిరిగుట్టకు మహా పాదయాత్ర

- రజతోత్సవ సభ విజయవంతానికి చేపట్టిన బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై
- జెండా ఊపి ప్రారంభించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

వలిగొండ, ఏప్రిల్15 : ఈ నెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న రజతోత్సవ మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వల్లమాల కృష్ణ, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్గు నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో వలిగొండ మండల పరిధి వేములకొండ గల మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నుంచి యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వరకు మహా పాదయాత్ర చేపట్టారు. దీనికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరై జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపు వాగ్దానాలను నమ్మి మోసపోయినట్లు ప్రజలు బాధపడుతున్నారని, కేసీఆర్ పాలనే బాగుందని చర్చించుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, కూలీలు, ఆటో కార్మికులు, యువకులు ఇబ్బంది పడుతున్నారని, యావత్ తెలంగాణ సమాజం గోసపడుతున్నదని తెలిపారు. వరంగల్ మహాసభకు లక్షలాదిగా ప్రజలు, యువకులు, విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మరింత శక్తిని అందించాలని కోరారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రజతోత్సవ మహా సభకు ప్రజలు, అభిమానులు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూడిద భిక్షమయ్య గౌడ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, క్యామ మల్లేశం, పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి, నాయకులు పనుమటి మమత నరేందర్‌రెడ్డి, ముద్దసాని కిరణ్‌రెడ్డి, కొమిరెల్లి సంజీవ రెడ్డి, డేగల పాండరి, కునపూరి కవిత, పల్సం రమేశ్, గూడూరు శేఖర్‌రెడ్డి, నాగారం ప్రశాంత్, తొట్ల స్వామి, జానీ అప్రోజ్, మద్దెల మంజుల తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రజతోత్సవ సభకు వేలాదిగా తరలిరావాలి

- ప్రజల కష్టాలు తెలుసుకొని రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌దే
- బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కట్టంగూర్, ఏప్రిల్ 15 : ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. కట్టంగూర్‌లోని సత్యసాయి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ పార్టీగా మొదలైన బీఆర్ఎస్ ప్రస్థానం రాజకీయ పార్టీగా ఎదిగి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేసిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల ఇబ్బందులను చూసి ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఏడాదిన్నర రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతో ఉన్నారని చెప్పారు. ఎప్పటికైనా తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ప్రజలు నమ్ముతున్నారని అన్నారు. రానున్న రోజులు బీఆర్ఎస్‌వేనని, పార్టీ నాయకులు, కార్యకర్తలు కొంత కాలం ఓపికగా ఉండాలని, ఎవరికీ భయపడొద్దని తెలిపారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వడ్డె సైదిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, నాయకులు గుర్రం సైదులు, దాసరి సంజయ్, గుండగోని రాములు, పెద్ది బాల నర్సయ్య, నకిరేకంటి నర్సింహ, మునుగోటి ఉత్తరయ్య, మంగదుడ్ల వెంకన్న, నోముల వెంకటేశ్వర్లు, దేవరకొండ నరేశ్, చౌగోని జనార్దన్, అంతటి శ్రీను, గుండమల్ల పురుషోత్తం, బీరెల్లి ప్రసాద్, జిల్లా యాదయ్య, జానీ పాష, బెల్లి సుధాకర్, రెడ్డిపల్లి మనోహర్, లింగస్వామి, పోతరాజు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

స్లాట్ బుకింగ్ విధానం రద్దు చేయాలి

డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

చౌటుప్పల్, ఏప్రిల్ 15 : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుని పాత రిజిస్ట్రేషన్ పద్ధతిని కొనసాగించాలని కోరుతూ మంగళవారం చౌటుప్పల్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన నిర్వహించారు. ఈ విధానంతో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వేల మంది డాక్యుమెంట్ రైటర్లు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉందని, దీంతో మరింత నిరుద్యోగ సమస్య పెరుగుతుందని వారు తెలిపారు. ఇంతకుముందు వందల సంఖ్యలో డాక్యుమెంట్లు చేశామని, ప్రస్తుత విధానంతో పరిమితి మించి చేసే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం కూడా ఆదాయం కోల్పోతుందని చెప్పారు. ఆనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు ఎస్.సత్యనారాయణ, ఎడ్ల లింగస్వామి, చింతకింది శ్రీనివాస్ గౌడ్, సందీప్ కుమార్, సీహెచ్.శ్రీనివాస్, బి.మల్లేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాల్సిందే!

- అప్పటి వరకు డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించం
- మరోసారి స్పష్టం చేసిన ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాలు
- తాజాగా ఎంజీయూ, ఉన్నత విద్యా మండలికి వినతి

ఎంజీయూలో పరీక్షల నియంత్రణాధికారికి వినతి పత్రం అందిస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు

రామగిరి, ఏప్రిల్ 15 : పేద, మధ్య తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. గతేడాది దసరా నుంచి దశల వారీగా కళాశాలను బంద్ చేపడుతూ, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను బహిష్కరిస్తూ నిరసనలు చేపడుతున్నాయి. ఈ నెల 2 నుంచి జరుగాల్సిన డిగ్రీ సెమిస్టర్ ప్రాక్టికల్, ఈ నెల 11 నుంచి జరుగాల్సిన థియరీ పరీక్షలను బహిష్కరించాయి. కానీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో మరోమారు ఆందోళనలకు సిద్ధమయ్యాయి. ఎంజీయూ యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికే వాయిదా వేసిన పరీక్షలను ఈ నెల 17నుంచి నిర్వహించనుండగా వాటిని సైతం బహిష్కరించనున్నట్లు కళాశాలల యాజయాన్యాలు ప్రకటించాయి. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించే వరకూ పరీక్షల బహిష్కరణ కొనసాగిస్తామని తెలంగాణ అప్లియేటెడ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ (టీపీడీపీఎంఏ) నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డికి వేర్వేరుగా వినతి పత్రాలు అందజేసింది. అంతకు ముందు హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి టీపీడీపీఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, భువనగిరి జాగృతి విద్యా సంస్థల అధినేత బి.సూర్యనారాయణరెడ్డి, ఎంజీయూ చాప్టర్ అధ్యక్షుడు, నీలగిరి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ మారం నాగేందర్‌రెడ్డి, సంఘం నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు రూ.150 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ సర్కార్ విడుదల చేయాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా బిల్లులు విడుదల చేయకపోవడంతో కరెంట్ బిల్లులు, భవనాల అద్దెలు, జీతాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని టీపీడీపీఎంఏ ఎంజీయూ చాప్టర్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మారం నాగేందర్‌రెడ్డి, ఎం. సైదారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సైతం ఈ విషయంపై ప్రభుత్వం, సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రామకృష్ణ, పి.భాస్కర్‌రావు, ఎం.వెంకట్‌రెడ్డి, దారిపల్లి ప్రవీణ్, గుండెబోయిన జానయ్యయాదవ్, మహేందర్‌రెడ్డి, హనుమంతు యాదవ్, ధనంజయ్ తదితరులున్నారు.

అమ్మానాన్న ఆశ్రమంలో అనాథలతో మాట్లాడుతున్న సినీ నటుడు బాబు మోహన్

అనాథలకు సేవ చేవ చేయాలి

- సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్
- కుమారుడి యాదిలో సేవా కార్యక్రమాలకు ముందుకు

చౌటుప్పల్, ఏప్రిల్ 15 : అనాథలకు సేవ చేసే మనస్తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ప్రముఖ సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని అమ్మానాన్న అనాథాశ్రమాన్ని ఆయన సందర్శించారు. తన కుమారుడు పవన్ జ్ఞాపకార్థం పవన్ బాబు మోహన్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్య, వైద్యం, ఆర్థిక సాయం అందించనున్నారు. అందులో భాగంగా మంగళవారం ఇక్కడకు వచ్చారు. మానసిక స్థితి సరిగ్గా లేక ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అనాథలతో మాట్లాడారు. వారికి పిచ్చిగా పెరిగిన జట్టును కత్తిరించారు. ఆనంతరం బాబుమోహన్ మాట్లాడుతూ అనాథలు దేవుడి ప్రతిరూపాలని, దైవ సంకల్పంతోనే వారికి సేవ చేసే భాగ్యం దక్కుతుందని అన్నారు. యువత కుటుంబాన్ని గుర్తు చేసుకుని బైక్‌లు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వహకులు గట్టు శంకర్, శ్రావణి, శ్యామ్ పాల్గొన్నారు.

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

అర్హులకు పెన్షన్, రేషన్ కార్డు ఇవ్వాలి

ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

రామగిరి, ఏప్రిల్ 15 : అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం లేక మహిళా సంఘాల సభ్యులు మరణిస్తే ఆ భారం గ్రూప్ సభ్యులపైన పడుతుందని తెలిపారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని, దరఖాస్తు చేసిన అర్హులైన మహిళలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ అనురాధ, జిట్టా సరోజ, నిర్మల పద్మ, భూతం అరుణ, తుమ్మల పద్మ, సుల్తానా, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి

మోటకొండూర్‌లో వ్యవసాయ ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

మోటకొండూర్, ఏప్రిల్ 15 : వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అధిక దిగుబడులు పొందాలని ప్రొఫెసర్, డాక్టర్ సుధాకర్ అన్నారు. మోటకొండూర్ గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనను ఏరువాక కేంద్రం భువనగిరి, వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థినులు సంయుక్తంగా నిర్వహించారు. పంట విత్తే సమయం నుంచి కోత వరకు యంత్ర పరికరాలను ఉపయోగించి కూలీల కొరతను ఎదుర్కోవడమే కాకుండా పెట్టుబడులను తగ్గించుకోవాలని సూచించారు. పంట మార్పిడి, అంతర పంటల, మిశ్రమ పంటల సాగును కొనసాగించాలని తెలిపారు. అనంతరం వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మోడల్స్ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం భువనగిరి శాస్త్రవేత్తలు డాక్టర్ బి.అనిల్ కుమార్, మధుశేఖర్, మండల వ్యవసాయ అధికారి రమాదేవి, ఉద్యానాధికారి స్రవంతి, శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమ్య, అభ్యుదయ రైతులు ఎల్లారెడ్డి, కంచి మల్లయ్య, సిద్దారెడ్డి, మల్లేశ్, భూమండ్ల ఐలయ్య, వేంకటేశ్వర్‌రెడ్డి, అనంతుల పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ రైతులు పంట నష్టం వివరాలు సమర్పించాలి

- ఉద్యానవన అధికారి ప్రవీణ్

నకిరేకల్, ఏప్రిల్ 15 : ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి, గాలిదుమారానికి పంట నష్టపోయిన నిమ్మరైతుల వివరాలు తెలపుతూ దరఖాస్తులు చేసుకోవాలని నకిరేకల్ ఉద్యానవన అధికారి ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి మండలాల్లో నష్టపోయిన నిమ్మరైతులు పంట వివరాలతో దరఖాస్తు చేసుకుని నకిరేకల్ ఏడీఏ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుకు రైతు పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను జతపరిచి ఇవ్వాలని పేర్కొన్నారు. దరఖాస్తులను పరిశీలించి నష్టపరిహారం కోసం పైఅధికారులకు పంపనున్నట్లు తెలిపారు.